

# యువశిల్పి దేవగుప్తపు రాజ్‌కుమార్

## పశ్చిమ గోదావరిజిల్లా వశిష్టా తీరంలోని నత్తరామేశ్వరానికి పేరు తెచ్చినవాడు

(ఓసారి తిరుపతిలో జరిగిన చతుర్థ ప్రపంచ తెలుగు మహాసభల్లో కలుసుకున్నాం. ప్రపంచంలో ఎక్కడ తెలుగు ప్రముఖులూ, కళాకారులున్నప్పటికినీ వెదికి వెదికి ఈ శిల్పిని పరిచయపరచడంలో వెనుకపడడం జరిగింది. రెండు రాష్ట్రాలుగా తెలుగువారు విడిపోతున్న తరుణంలో ఈ యువ శిల్పి దేవగుప్తపు రాజ్‌కుమార్ మెండు ప్రతిభను సశిల్ప అక్షరాలతో వివరించడం ధర్మంగా భావిస్తున్నాను)

**మ**నకు తెలియని ఎందరో ప్రముఖ కళాకారులు శిల్పులు మన ఆంధ్రలోనే ఉన్నారు. ఒకసారి ఓ యాభై సంవత్సరాలకు పూర్వం వెండి రేకులతో నాముఖ బింబాన్ని తీర్చిదిద్ది పంపించిన ఆచారి. ఆయన మా పాలకొల్లువాడే- మద్రాసులో ఉన్న సుప్రసిద్ధ చిత్రకారుడు ఈశ్వర్‌కు దగ్గరి బంధువని అప్పుడే తెలిసింది.



ఈ దేవగుప్తపు రాజ్‌కుమార్‌ను నేనెరుగపోయినా, నేను చదువుకునే రోజుల్లో స్కౌటు విద్యార్థిగా- అంతర్వేదికి కాలినడకన వెడుతూ నత్తరామేశ్వరం మీదుగా నడిచివెళ్ళాను. అక్కడ శ్రీరామాలయం ఉన్నది. ఈ శిల్పి రాజ్‌కుమార్ 1972 ఏప్రిల్ 4 శ్రీరామనవమి రోజున జన్మించాడన్న విషయం నన్నెంతో స్పందింపజేసింది. ఆయన పేరుగన్న ఆచార్య శ్రీనాధ్ శిల్పి కుమారుడని, తండ్రే ఆయన గురువనీ - అది శిల్పుల కుటుంబమనే విషయం తెలుసుకోలేదని మరీ బాధపడ్డాను. ఇన్ని తేజోమయ శిల్పాలను సజీవంగా శిల్పీకరించిన రాజ్‌కుమార్‌ను అభినందించకుండా ఉండలేకపోతున్నాను. ఈ యువశిల్పి శిలావిగ్రహాలు తీర్చిదిద్దడంలో నేర్పరితనం పొందాడనీ, గౌతమబుద్ధుణ్ణి తొలిశిల్పంగా తీర్చిదిద్దిన నా హృదయమెంతో ఆనందకందితుణ్ణి చేసిందన్నారు. ఆ తెలుగు మహాసభల నాటికే రెండువేల శిల్పాలను తీర్చిదిద్దడం సామాన్య విషయం కాదు. ఈ శిలా విగ్రహ శిల్పకళకు తోడు జ్యోతిష్యం, వాస్తుశాస్త్రముల్లోగల అభిరుచి కూడా యీ చిరంజీవిని చిరకీర్తి సంపన్నునిగా తీర్చిదిద్దినది.

రవీంద్రనాధ్ ఠాగూర్ శాంతినికేతనం అంటే తనకెంతో గౌరవమంటారు. తనకు వచ్చే ఆదాయ వనరుల్లో కొంత శాతం వృద్ధ జనులకు సహాయం చేస్తున్నాని చెప్పడం నాకెంతో ఆనందం కలుగజేసింది. ఈ ఉదార స్వభావం ఈ కాలంలో ఎంతమందికి ఉంటుంది?

శ్రీనాథ రత్న శిల్పివుడయార్ శిల్పకళా సాంస్కృతీ సంస్థను నెలకొల్పి, ప్రతీ సంవత్సరమూ వివిధ రంగాల్లో నైపుణ్యం కలవారిని సత్కరిస్తున్న ఈ సహృదయమందారుణ్ణి అరవింద దళాయతాక్షుడు ఆయురారోగ్య సంపన్నతను కూరుస్తూ 'శతాయుష్మాన్ భవా' యని దీవించ గలడని నా విశ్వాసం. తూర్పుగోదావరి జిల్లాలోని కొత్తపేటలో ఎందరెందరికో శిల్పకళను నేర్పడం నిమిత్తంగా చేసుకుని, వుడయార్ శిల్పకళాశాలను స్థాపించి అమేయ కృషి చేస్తున్నారు.

కోస్తాంధ్రలోని కోనసీమగా ప్రసిద్ధిచెందిన తూర్పుగోదావరి జిల్లాలోని కొత్తపేట పట్టణంలో బస్సు నిలయం ఎదుటనే వీరి శిల్పకళాశాల నిర్వహింపబడుతూన్నది. వీరు 09849040866లో ఉంటారని శిల్ప చిత్రకళా ఆల్బంలో తెలియచేసారు. నేను అమెరికాలోని న్యూయార్కు మహానగరంలో తిలకించిన మైనంతోనూ, తెల్లరాయితోనూ శిల్ప చిత్రిత విగ్రహాలుగా ఉన్నవాటికి దీటుగా రాజ్‌కుమార్ వుడయార్ విగ్రహాలున్నాయని నా మనస్సుకు స్ఫురించింది.

**శుభమ్ భవతు!**




